సమీక్ష

# శకుంతలాదేవి

హ్యూమన్ కంప్యూటర్‌గా ప్రపంచానికి సుపరిచితురాలు శకుంతలాదేవి. ఆమెకు గణితంలోనే కాదు, జ్యోతిష్యంలోను చాలా నేర్పు ఉంది. విద్యాభ్యాసం కూడా ఎరుగని ఒక చిన్నారి ఏకంగా విశ్వవిద్యాలయంలో గణిత ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదిగారు.

శకుంతలాదేవి 1929 నవంబర్ నాలుగున బెంగళూరులో పుట్టారు. చిన్నతనంలో ఆమె చాలా పేదరికంలో పెరిగారు. ఆమె తండ్రి సర్కస్‌లో పనిచేసేవారు. శకుంతలా దేవికి గణితం అంటే చాలా ఇష్టం. ఆ విషయాన్ని ఆమె తండ్రి ఆమెకు 3ఏళ్ళ వయస్సులోనే గుర్తించారు. ఒక రోజు పేక ముక్కలతో ట్రిక్ చేసి తండ్రిని ఓడించటంలో ఆమె ప్రతిభ బయటపడింది. అంకెలను గుర్తుపెట్టుకోవటంలో ఆమెకున్న ప్రతిభను గుర్తించిన తండ్రి సర్కస్‌లో ఉద్యోగం మానేసి ఆమె చేత గణిత ప్రదర్శనలు ఇప్పించటంమొదలు పెట్టారు. ఆరేళ్ళ వయసులోనే మైసూర్ విశ్వవిద్యాలయంలో గణితప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఆమె ఎదిగారు. 14 ఏళ్ళ వయసులోనే తండ్రితో కలిసి గణిత ప్రదర్శనలు ఇచ్చేందుకు లండన్ చేరుకున్నారు.

అలా ఆమె యూరోప్, అమెరికా వంటి దేశాలలో ప్రదర్శనలు ఇస్తూ వచ్చారు. విద్య అభ్యసించకుండానే ఇలా ప్రదర్శనలు ఇవ్వడం ఆమె గొప్పతనం. 1977 లో టెక్సాస్ సదరన్ మెథడిస్ట్ యూనివర్శిటీలో ఒక ప్రదర్శన ఇచ్చారు. 201 అంకెలు కలిగిన ఒక సంఖ్యకు 23వ వర్గమూలాన్ని కేవలం 50 సెకన్లలో గణించి అందరినీ ఆశ్చర్యపోయేలా చేశారు. ఆ ప్రదర్శన లోనే కంప్యూటర్ ఇచ్చిన రెండు 13 అంకెలు కలిగిన సంఖ్యలను 28 సెకన్లలోనే గణించి చెప్పారు. అప్పటినుంచీ ప్రపంచం ఆమెను హ్యూమన్ కంప్యూటర్‌గా గుర్తించింది. గిన్నిస్ బుక్‌లో స్థానం సాధించింది. ఆ రికార్డు ఇప్పటికీ అలానే ఉన్నది. గతాబ్దకాలంలో ఏ తేదీ చెప్పిన అది ఏ వారం అవుతుందో ఆమె చిటికెలో చెప్పగలరంటే ఆమె మేధస్సును అర్థం చేసుకోవచ్చు. ఆమె ఫన్ విత్ నంబర్స్, ఆస్ట్రాలజీ ఫర్ యు, పజిల్స్ టు పజిల్ యు, మాథేబ్లిట్ వంటి ఎన్నో పుస్తకాలు వ్రాశారు.

ఆమె ఎన్నికలలో ఇందిరా గాంధీ పైనే పోటీకి దిగారు. ఆంధ్ర ప్రదేశ్ లోని మెదక్‌లో ఇందిరా గాంధీ పైన పోటీ చేసి ఓడిపోయారు.

1960లో శకుంతలా దేవి పరితోష్ బెనర్జీ అనే ఐ.ఏ.ఎస్ అధికారిని పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక కుమార్తె. కొద్ది కాలానికే ఆమె భర్త నుంచి విడిపోయారు. శకుంతలాదేవి 2013లో బెంగళూరులో మరణించారు.

శకుంతలాదేవి అంటే నాకు చాలా ఇష్టం. ఆమె మీద సినిమా వచ్చింది. అది నేను చూశాను. శకుంతలా దేవి చాలా తెలివైనది. క్షణాలలో కష్టమైన గణిత ప్రశ్నలకు జవాబు చెప్పేవారు. అది నాకు ఆశ్చర్యం వేసింది. క్యూబ్ మూలాలను 5 సంవత్సరముల వయస్సులో చేయటం ఇంకా ఆశ్చర్యంగా ఉన్నది. శకుంతలాదేవి గురించి తెలిసినప్పుడు నాకు ఇష్టము కలిగింది ఆమె అంటే.